
సాక్షి అనకాపల్లి

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



కేకే లైన్‌లో మాక్‌డ్రిల్

విశాఖ: వర్షాకాలంలో కేకే లైన్‌లో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు 20 మంది సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు.



వైభవంగా సుప్రభాత సేవ

విశాఖ: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. స్వామికి అభిషేకాలు చేశారు.



రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు

విశాఖ: ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు శనివారం పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు.



జలగలమదుం జంక్షన్ సమీపంలోని అనకాపల్లి-విశాఖ హైవే దుస్థితి



అనకాపల్లిలో విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు



శేషగెడ్డ పొంగి యలమంచిలి రహదారిపై ప్రవహిస్తున్న నీరు

దంచికొడుతున్న వర్షం

- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్
- విద్యా సంస్థలకు సెలవు
- జిల్లాలో మరో మూడు రోజులు భారీ వర్షాలు
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

కలెక్టరేట్
08924 - 226599
08924 - 222888

ఆర్డీవో కార్యాలయం అనకాపల్లి
94919 98293

ఆర్డీవో కార్యాలయం నర్సీపట్నం
70753 56563



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిచిన వర్షపు నీరు

తుమ్మపాల: జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా జోరున వాన కురుస్తూనే ఉంది. జనజీవనం పూర్తిగా ఇళ్లకే పరిమితమైంది. వర్షపు నీరు వాగులు, కాలువలతోపాటు రోడ్ల మీదుగా పారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కాస్త వాయుగుండంగా మారడంతో భారీ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ ప్రకటన నేపథ్యంలో జిల్లాలో దీని ప్రభావం అధికంగానే ఉంది. వచ్చే నెల 3వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉండటంతో అన్ని మండలాల్లోను భారీ వర్షపాతం నమోదవుతోంది. ముంపు ప్రాంతాలు, ప్రజల ఇబ్బందుల దృష్ట్యా కలెక్టర్ విజయకృష్ణన్ కలెక్టరేట్, అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఆర్డీవోలతో పాటు జిల్లా వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులను అప్రమత్తం చేశారు. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ముంపు సమస్యతో ప్రజలకు ఇబ్బందులకు గురైతే తక్షణమే సహాయక చర్యలు చేపట్టే విధంగా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రజలకు అవసరమైనంత మేరకు నిత్యావసర సరకులు, గ్యాస్ నిల్వలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్, జిల్లా పంచాయతీ అధికారులకు తెలియజేశారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దన్నారు. వెళ్లిన వారిని తిరిగి వెనక్కి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారులను కలెక్టరు ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

జిల్లా, డివిజన్ స్థాయిలో 24 గంటల పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్ ఫోన్ 08924-226599, 08924-222888, ఆర్డీవో కార్యాలయం (అనకాపల్లి) కంట్రోల్ రూమ్ ఫోన్. 9491998293, నర్సీపట్నం ఫోన్ 7075356563 నంబర్లతో పాటు నీటిపారుదల శాఖ చోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఫోన్ 9849553188, 08934-245009, నర్సీపట్నం ఏఈ కార్యాలయం - 8978542297కు సంప్రదించి ప్రజలు సహాయం పొందగలరని కలెక్టరు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆమెతోపాటు జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో శనివారం పరిశీలించారు.

- ప్రజలకు వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు ప్రత్యేక హెచ్చరిక సమాచారాన్ని మొబైల్స్‌కు పంపిస్తోంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ప్రజలను అప్రమత్తం చేయడం, తీరం వెంబడి 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, కాలువలు, కల్వర్టులు, మ్యాన్‌హోల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయట తిరగవద్దని పేర్కొంటోంది.
- కోటవురట్ల పాతరోడ్డు వద్ద వరాహనదిలో సర్పానది నీరు కూడా సంగమించడంతో ఇక్కడ ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల పందూరు వద్ద వరాహనదిని దాటుతూ ఓ రైతు గల్లంతైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నీటిమట్టం పెరుగుతుండడంతో ఎవరూ నదిని దాటే ప్రయత్నం చేయొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.
- మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు. ఈ వర్షాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.
- శనివారం సాయంత్రం అనకాపల్లి ఆర్డీవో ఎ.చిన్నికృష్ణ రైవాడ జలాశయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 108.15 మీటర్లకు చేరిందని, 365 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుందని, జలాశయానికి ఎటువంటి ప్రమాదం లేదని జలాశయం ఏఈ నరేష్ ఆర్డీవోకు వివరించారు.

ఒక్కరోజే 1,651.4 మి.మీ. వర్షపాతం

అల్పపీడనం కారణంగా జిల్లాలో శనివారం కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక చోట్ల పంటపొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. పలు రకాల పైరు పంటల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఒక్కరోజే జిల్లాలో రాంబిల్లి మండలంలో అత్యధికంగా 119.4 మి.మీ., అత్యల్పంగా 41 మిల్లీ మీటర్లతో మాడుగుల మండలం నమోదైంది. మొత్తం మీద 1651.4 మి.మీ. వర్షపాతం నమోదు కాగా సగటు 68.8 మి.మీ.గా ఉంది.

మండలం	వర్షపాతం (మి.మీ)	మండలం	వర్షపాతం (మి.మీ)
రాంబిల్లి	119.4	కశింకోట	61.4
మునగపాక	97.7	నాతవరం	56.4
అచ్యుతాపురం	93.0	దేవరాపల్లి	55.7
అనకాపల్లి	92.4	రావికమతం	54.1
నక్కపల్లి	91.6	కోటవురట్ల	52.0
యలమంచిలి	88.4	రోలుగుంట	49.6
పాయకరావుపేట	84.2	నర్సీపట్నం	46.8
బుచ్చెయ్యపేట	70.2	మాకవరపాలెం	46.4
ఎస్.రాయవరం	69.4	చోడవరం	43.2
గొలుగొండ	64.6	చీడికాడ	41.8
కె.కోటపాడు	62.6	మాడుగుల	41.0

బాధితులకు అండగా..



రాంబిల్లి మండలం మూలజంప గ్రామంలో వేగి సన్యాసినాయుడు భార్యకు రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న బొత్స సత్యనారాయణ

సామాన్యుల గొంతుకై నినదిస్తాం..

- చివరి వరకు వారి పక్షాన పోరాడతాం..
- ఫార్మా ప్రమాద మృతుల కుటుంబాలను ఓదార్చిన బొత్స
- వైఎస్సార్‌సీపీ తరపున రూ.5 లక్షల ఆర్థిక సాయం



ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో మృతుడు జువ్వాది చిరంజీవి భార్యను ఓదారుస్తున్న బొత్స సత్యనారాయణ



ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం గ్రామంలో పూసర్ల నాగేశ్వరరావు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బొత్స సత్యనారాయణ

ఎస్.రాయవరం/ రాంబిల్లి (యలమంచిలి), అచ్యుతాపురం (మునగపాక): బాధితులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. నోరు లేని సామాన్యుల తరపున గళం వినిపిస్తామని చెప్పిన విధంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫార్మా బాధితుల పక్షాన నిలబడి వారికి త్వరగా పరిహారం వచ్చే విధంగా చేశారన్నారు. అంతేకాకుండా పార్టీ తరపున ఆర్థిక సహాయం అందజేయమని తమను పంపించారని చెప్పారు. ఆయన శనివారం అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో మరణించిన ఐదు కుటుంబాల వారిని కలిసి పార్టీ తరపున రూ.5 లక్షల చెక్కు అందజేశారు. మునగపాక మండలంలో ఎల్లబిల్లి చిన్నారావు, పూడి మోహన్ కుటుంబాలకు, ఎస్.రాయవరం మండలంలో దార్లపూడి గ్రామానికి చెందిన జువ్వాది చిరంజీవి, బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన పూసర్ల నాగేశ్వరరావు కుటుంబాలకు, రాంబిల్లి మండలం మూలజంప గ్రామంలో వేగి సన్యాసినాయుడు కుటుంబానికి చెక్కులు అందించి, బాధితులను ఓదార్చారు. ప్రమాదంలో 17మంది మరణించినందుకు, ఎంతోమంది క్షతగాత్రులైనందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా కలత చెందారని, వారిని పార్టీ తరపున ఆదుకుంటామని పరామర్శకు వచ్చినప్పుడే ప్రకటించారని బొత్స చెప్పారు. చెప్పిన విధంగా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.లక్ష వంతున చెక్కులు అందిస్తున్నామన్నారు. టీడీపీ నేతలు మొసలి కన్నీరు కార్చడం కాదని, పార్టీ తరపున వారు కూడా సాయం అందిస్తే బాగుంటుందని, అది కనీస ధర్మమన్నారు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది గాయాలపాలయ్యారన్నారు. సరైన భద్రత, రక్షణ లేకపోవడమే ప్రమాదానికి కారణమైందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని రూ.కోటి నష్టపరిహారం అందించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేయడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందని, ఇంకా కొంతమంది క్షతగాత్రులకు పరిహారం అందలేదని తెలుస్తోందని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించే వరకు వారికి అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని చెప్పారు. ఆయన వెంట మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీలు బోదెపు గోవిందరావు, కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీలు లాలం రాంబాబు, కాకర దేవి, ధూళి నాగరాజు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, చిక్కాల రామరావు, శీరం నరసింహమూర్తి, దేశంశెట్టి శంకరరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం, పార్టీ నేత గొట్టుముక్కల శ్రీనుబాబు ఉన్నారు.

న్యూస్‌రీల్

10న జీవీఎంసీ సర్వసభ్య సమావేశం



సాక్షి, విశాఖపట్నం: ఆర్నెల్ల విరామం తర్వాత మహావిశాఖ నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. నగర పరిధిలో జరిగే అభివృద్ధి పనులు, పాలనాపరమైన నిర్ణయాలతో కలిపి మొత్తం 28 అంశాలతో అజెండా రూపొందించామన్నారు. తర్వాత వచ్చే పనులకు సంబంధించిన అంశాలతో టేబుల్ అజెండా పొందుపరుస్తామని మేయర్ వివరించారు. ఇప్పటికే అన్ని పార్టీల కార్పొరేటర్లకు సమాచారం అందించినట్టు తెలిపారు.

క్షతగాత్రులకు రూ.లక్ష చెక్కు అందజేత



మెడికవర్‌లో చికిత్స పొందుతున్న వారికి చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

ఎంవీపీకాలనీ (విశాఖ): ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు వైఎస్సార్‌సీపీ తరపున రూ.లక్ష చెక్కులు అందజేశారు. శనివారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. ఏడుగురు క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు.

టీడీపీ నేతల చేష్టలతో కుప్పకూలిన హెచ్‌ఎం

- ఎస్‌ఎంసీ ఎన్నికకు కోరం లేకపోయినా ఒత్తిడి
- స్పృహతప్పి ఆస్పత్రిలో చేరిన పెదపూడి హెచ్‌ఎం



పెదపూడిలో స్పృహతప్పి పడిపోయిన హెచ్‌ఎంను ఆస్పత్రికి తరలిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: పార్టీలకతీతంగా నిర్వహించాల్సిన స్కూల్ కమిటీల ఎన్నికల్లోనూ అధికార పార్టీ పెత్తనం చెలాయిస్తోంది. తాజాగా మండలంలోని పెదపూడి పాఠశాలలో కోరం లేకపోయినా ఎన్నిక నిర్వహించాలని టీడీపీ నాయకులు ఒత్తిడి తేవడంతో హెచ్‌ఎం సుగుణాకర్‌కు బీపీ తగ్గి చెమటలు పట్టి స్పృహ తప్పి కింద పడిపోయారు. దీంతో ఉపాధ్యాయులు ఆయన్ను ఎన్నికల బందోబస్తుకు వచ్చిన పోలీస్ జీపులో తురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. ఇక్కడ పాఠశాలలో 61 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. ఉదయం 11 గంటల తర్వాత చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోవడంతో కోరం లేదని ఎన్నిక వాయిదా వేసినట్టు హెచ్‌ఎం తెలిపారు. దీంతో వారంతా ఇళ్లకు, పొలాలకు వెళ్లిపోయారు. తర్వాత టీడీపీ వర్గీయులు వచ్చి ఎన్నిక నిర్వహించాలని పట్టుబట్టి హెచ్‌ఎంపై ఒత్తిడి తెచ్చారు. వాయిదా వేశామని చెప్పడంతో చాలామంది ఇళ్లకు పోయారని, ఇప్పుడు ఎన్నిక ఎలా నిర్వహిస్తారని రెండో వర్గం వారు హెచ్‌ఎంను నిలదీశారు. దీంతో ఇరువర్గాల వారి వాదనలకు తోడు అధికార పార్టీ నాయకుల ఫోన్ల ఒత్తిడికి గురైన హెచ్‌ఎంలో బీపీతో స్పృహ తప్పి కింద పడిపోయారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఎంఈవోలు బొంజుబాబు, కాశీ విశ్వేశ్వరరావు పెదపూడి స్కూల్‌కు వచ్చి అక్కడ పరిస్థితిని తెలుసుకున్నారు. ఆరు గంటల ప్రాంతంలో డీఈవో ఆదేశాలతో 37 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఉండటంతో ఎన్నిక నిర్వహించినట్లు ఎంఈవో బొంజుబాబు తెలిపారు.

తొలగింపుతో పింఛనుదార్ల గగ్గోలు

- గొలుగొండ మండలంలో 22మంది దివ్యాంగులకు అన్యాయం
- జిల్లాలో మొదటి రోజు 94.81 శాతం మందికి పెన్షన్ పంపిణీ



గొలుగొండ ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగ పింఛన్‌దారులు



పాయకరావుపేటలో వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి వంగలపూడి అనిత

గొలుగొండ/తుమ్మపాల/పాయకరావుపేట: ఒకరోజు ముందుగానే సామాజిక పింఛన్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం అర్హులపై కోత వేసి వారి కడుపు మీద కొట్టింది. ఒకట్రెండు కాదు... 20 సంవత్సరాలుగా దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న గొలుగొండ మండలవాసులకు కన్నీళ్లు మిగిల్చింది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉండటమే ఇప్పుడు వారి పాలిట శాపమైంది. టీడీపీ నేతలు కక్ష గట్టి ఉన్నపళంగా పింఛన్లు తొలగించడంతో లబోదిబోమంటూ ఎంపీడీవోను ఆశ్రయించారు. గొలుగొండ మండలం పాకలపాడు పంచాయతీలో 22 దివ్యాంగ పింఛన్ల తొలగింపుపై బాధితులు శనివారం ఎంపీడీవో డేవిడ్‌రాజుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 520 పింఛన్లు ఉన్నాయి. వీరికి తాజాగా అధికారులు పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ జాబితాలో 22 మంది దివ్యాంగ పింఛన్‌దారుల పేర్లు లేకపోవడంతో వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉండటం వల్లే గ్రామంలో టీడీపీ నేతలు కక్షగట్టి పింఛన్లు అన్యాయంగా తొలగించారని వాపోయారు. 20 సంవత్సరాల నుంచి పింఛన్లు అందుకుంటున్నామని, ప్రస్తుతం వీటిని తొలగించడం వల్ల ఎలా బతకాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వాటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, నాయకులు యాళ్ల నాయుడు, ఇటంశెట్టి పెదబాబులు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ

సబ్బవరం మండలం బాటజంగాలపాలెం గ్రామంలో పింఛనుదారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ రూ.4 వేలు వంతున పింఛన్ అందించారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,61,800 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా మొదటి రోజు సాయంత్రం 6 గంటల సమయానికి 2,47,781 మందికి 94.81 శాతం పింఛన్ పంపిణీ చేశారు. పాయకరావుపేట బృందావనం కాలనీలో పింఛనుదార్లకు హోం మంత్రి వంగలపూడి అనిత పింఛన్ పంపిణీ చేశారు.

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామంలో, గొలుగొండ మండలంలో పింఛన్లు పంపిణీ చేశారు. ధర్మసాగరంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబరు 2న రాష్ట్రంలో గ్రామాలను శుభ్రం చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



బాలికల వసతి గృహ సమస్యలను తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

యలమంచిలి రూరల్: పట్టణంలోని రంగావారి వీధిలో బీసీ వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహాన్ని శనివారం రాత్రి యలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పేపకాయల విజయ తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఏజీపీ ద్వారపురెడ్డి వెంకట్రావ్, ప్యానల్ లాయర్ బీ శంకరరావులతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోందని అధికారులు చెప్పారు. ఇక్కడ 80 మందికిపైగా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థినులు ఉంటున్నారని వివరించారు. అనంతరం గదులు, ఆహార మెనూ, స్టాక్‌ను సీనియర్ సివిల్ జడ్జి పరిశీలించారు. సమస్యలు ఉంటే కోర్టుకు వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టాలు, గృహ హింస, ఎఫ్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ వి.శైలజ, నిర్మల పాల్గొన్నారు.

చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా రామకృష్ణప్రసాద్



సీతమ్మధార (విశాఖ): ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు రామకృష్ణ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ కేడర్‌లో ఉన్న రామకృష్ణ ప్రసాద్‌ను ప్రభుత్వం ఎస్పీగా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన గురుద్వారా సమీపంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసరావు



గొలుగొండ: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా కృష్ణదేవిపేట జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టరు అంకంరెడ్డి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈయన 2004 నుంచి పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసి 2017లో కృష్ణదేవిపేటకు బదిలీపై వచ్చారు. విద్యా రంగంలో ఈయన సేవలను గుర్తించి ఇండియన్ స్కూల్ ఇన్నోవేటివ్ సంస్థ పురస్కారానికి ఎంపిక చేసింది.

దేశ వ్యాప్తంగా వెయ్యికిపైగా నామినేషన్లు రాగా, 50 మందిని ఎంపిక చేసింది. వారిలో శ్రీనివాసరావు ఉన్నారు. ఈ నెల 15వ తేదీన రాజస్థాన్‌లోని జైపూర్‌లో పురస్కారం అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడంతో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు అభినందనలు తెలిపారు.

తాండవ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తం



నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం, ప్రాజెక్టు డీఈ అనురాధ

నాతవరం: తుపాను ప్రభావం తగ్గేంత వరకు తాండవ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. తాండవ రిజర్వాయరును ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రాజెక్టు నీటి నిల్వలను, ఇటీవల తెగిన ప్రధాన మెయిన్ గేటు-1 ఐరన్ తాడును పరిశీలించారు. రిజర్వాయరు అంతా కలియ తిరిగారు. ప్రమాద స్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా, శనివారం ఉదయానికి 377.7 అడుగులు ఉందని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. 378 అడుగులు వచ్చేసరికి నదీలోకి నీటిని విడుదల చేస్తామన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో ఉదయం వరకు 600 క్యూసెక్కులు వచ్చేదని, సాయంత్రానికి బాగా తగ్గిందన్నారు. ప్రాజెక్టు నీటిని నదిలోకి కాకుండా ప్రధాన కాలువల ద్వారా రోజు ఒక్కంటికి 485 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ తుపాను ప్రభావం తగ్గేంత వరకు డివిజన్‌లో అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. తుని - నర్సీపట్నం మధ్య గన్నవరం మెట్ట వద్ద వెదుళ్ల గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుందన్నారు. అక్కడ రెవెన్యూ, పోలీసు అధికారులను కాపలా పెట్టామన్నారు. ప్రవాహం తగ్గింత వరకు వాహన రాకపోకలు నిలుపుదల చేస్తామన్నారు. ప్రాజెక్టు జేఈలు రామకృష్ణ పాత్రుడు, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, ఆర్ఐ హరి, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

పిలిచి అవమానించారు

• మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



నర్సీపట్నం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 29న జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో జనసేన నాయకుడు రాజాన సూర్యచంద్ర తనను అవమానించారని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ వారు ఇచ్చిన ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. కనీసం ప్రొటోకాల్ పాటించకుండా జనసేన నాయకుడు చైర్‌పర్సన్ అయిన తనను అవమానానికి గురి చేశారని ఆవేదన చెందారు. నిర్వాహకులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

స్టేట్ వూషూ పోటీల్లో రెండు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

నర్సీపట్నం: ఈ నెల 29, 30 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన స్టేట్ సీనియర్ వూషూ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన వేపాడ ప్రియాంక 75 కిలోల విభాగంలో రజత పతకం, ఉలం రవికుమార్ 70 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. అనకాపల్లి వూషూ సెక్రటరీ, నేషనల్ వూషూ రిఫరీ వెంకటేష్ సమక్షంలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఏపీ వూషూ అసోసియేషన్ ఫౌండర్, టెక్నికల్ చైర్మన్ మోహన్ ముత్యాలరావు క్రీడాకారులను అభినందించారు.

గంజాయి నిందితులను అరెస్టు చేయాలి

• పెండింగ్ కేసులు సత్వరం పూర్తి చేయాలి
• అధికారులకు ఎస్పీ దీపిక ఆదేశాలు



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి : పోలీసు దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ప్రధానమైన కేసుల్లో నిందితులను తక్షణమే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. తమ కార్యాలయంలో శనివారం నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే కొంతమంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఆమె పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకి చెందిన నిందితులను స్థానిక పోలీసులు సహాయంతో అరెస్టు చేయాలన్నారు. నేషనల్ హైవే, ఇతర రహదారుల్లో ప్రమాదాల నివారించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారితో మాట్లాడి అక్రమ మీడియన్‌లను మూయించడం, స్టాపర్ బోర్డులు, బ్లింకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో(బ్లాక్ స్పాట్స్) హైవే మొబైల్ ఆయా ప్రదేశాల్లో తిరిగేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్స్ వాహనాల నడిపి ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనల్లో వాహనాలు సీజ్ చేసి వారి తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. రాబోయే లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులను ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ చేసి స్వచ్ఛందంగా రాజీ పడేలా చూసి తద్వారా కేసులు తగ్గించాలన్నారు. పెండింగ్ కేసులలో దర్యాప్తును పూర్తి చేసి అభియోగ పత్రాలను కోర్టులో సమర్పించి యూ.ఐ కేసులను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన 22 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలతో ఆమె సత్కరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు ఎస్.లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, గణేష్, మన్మధరావు, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్ఐలు నాగ కార్తీక్, రఘువర్మ పాల్గొన్నారు.

రోజూ 5 వేల వీధిదీపాలు వెలగడం లేదు

• వందరోజుల ప్రణాళికను పక్కగా అమలు చేస్తాం
• శివారు ప్రాంతాలకు మంచినీటి సరఫరాకు ప్రణాళికలు
• టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందిపై నిత్యం ఫిర్యాదులొస్తున్నాయి
• మీడియా సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీలో ప్రతి రోజూ 5 వేల వరకూ వీధి దీపాలు వెలగకపోవడంపై నిరంతరం ఫిర్యాదులొస్తున్నాయనీ.. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. జీవీఎంసీ అభివృద్ధికి నిర్దేశించుకున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఏ ఏ చర్యలు తీసుకుంటున్నామనే అంశాలను కమిషనర్ శనివారం మీడియాకు వివరించారు.

1200 స్ట్రీట్‌లైట్స్ ప్రతి రోజూ పగులుతున్నాయి

ప్రతి రోజూ వీధిదీపాల సమస్యపై వస్తున్న ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయి పరిశీలనలో అనేక విషయాలు తెలిశాయి. వీధిదీపాల నిర్వహణ విషయంలో ఏజెన్సీ విఫలమవుతోందని గుర్తించాం. మెయింటెనెన్స్‌కు 700 నుంచి 800 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించాం. సాధారణ సమస్యలకు ఆకతాయిల ఆగడాలు తోడవుతున్నాయి. ప్రతి రోజూ 1100 నుంచి 1200 స్ట్రీట్ లైట్స్ పగిలిపోతున్నాయన్న ఫిర్యాదులపై రాత్రి సమయంలో పరిశీలిస్తే.. ఆకతాయిలు చేస్తున్న దుశ్చర్యలుగా గుర్తించాం. గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలు సాగించేందుకు డార్క్ స్పాట్స్ ఏర్పాటు చేసేందుకు 89 ప్రాంతాల్లో ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో రాత్రి గస్తీ చేపడుతున్నాం.

డ్రైనేజీల్లో మంచినీటి పైప్‌లైన్లు

తాగునీటి కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించాం. దశాబ్దాల క్రితం వేసిన 390 పైప్‌లైన్లు డ్రైనేజీల మీదుగా క్రాస్ అవుతున్నట్లు గుర్తించాం. వీటిలో 345 పైప్‌లైన్లను సరిచేశాం. మిగిలిన వాటి పనులు త్వరలోనే పూర్తవుతాయి. జీవీఎంసీకి చెందిన పంప్ హౌస్‌ల వద్ద ప్రత్యేకించి ఏర్పాటుచేసిన ల్యాబ్‌ల్లో రోజుకు 2,500 నీటి నాణ్యత తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఏపీపీసీబీ అధికారులు ప్రతి 3 నెలలకోసారి స్థానిక ఎస్‌హెచ్‌జీ మెంబర్ సమక్షంలో నీటి నాణ్యత పరీక్షలు చేస్తున్నారు. నీటి సరఫరాలో గ్యాప్ అనాలసిస్‌ని గుర్తించి, ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ విషయమై సర్వే చేసి 22 వేల ఇళ్లను గుర్తించడం జరిగింది. వాటికి కావలసిన మౌలిక సదుపాయాలు అమృత్, ఇతర పథకాల ద్వారా అందించనున్నాం. శివారు ప్రాంతాలకు సమర్థవంతంగా తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

టౌన్‌ప్లానింగ్‌పై ఎక్కువ ఫిర్యాదులు

టౌన్‌ప్లానింగ్ విభాగంపైనే గ్రీవెన్స్‌లో 80 శాతానికి పైగా ఫిర్యాదులొస్తున్నాయి. ప్రతి రోజూ 5,700కి పైగా ప్లాన్ కోసం దరఖాస్తులు వస్తున్నాయి. వీటిలో ఎక్కువ దరఖాస్తులు షార్ట్‌ఫాల్ లిస్ట్‌లో చేరుతున్నాయి. అసలు ఎక్కడ లోపాలున్నాయనే దానిపై సమీక్ష నిర్వహిస్తున్నాం. మరోవైపు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించేందుకు కేంద్రీకృత బృందం ఏర్పాటు చేశాం. ప్లాన్ లేకుండా జరుగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలకు జోనల్ స్థాయి బృందాలు ఏర్పాటు చేస్తున్నాం. 100 రోజుల్లో టౌన్‌ప్లానింగ్ ప్రక్షాళన జరుగుతుందని ఆశిస్తున్నాను.

శిథిలమైన భవనాలపై చర్యలు

తుఫాన్లు, భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నాం. కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ.. వారికి పునరావాస కేంద్రాలను జోన్లవారీగా ఏర్పాటు చేస్తున్నాం. నగర పరిధిలో 1,628 శిథిలమైన భవనాలను గుర్తించాం. పునరావాస కేంద్రాల గుర్తింపు ప్రక్రియకు యూసీడీతో సమన్వయం చేస్తున్నాం. భవన ప్రణాళికలు, పెండింగ్ ఫైల్స్, ప్రజల సమస్యలపై అభిప్రాయాల కోసం లైసెన్స్ టెక్నికల్ పర్సన్, బిల్డర్స్ అసోసియేషన్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

అనుమానం పెనుభూతమై!

మర్రిపాలెం (విశాఖ): ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత హత్య కలకలం రేపింది. వివరాలివీ.. తుమ్మడిపాలెంలో ధనేశ్వరరావు, అతని భార్య(23), పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరికి 2018లో వివాహం జరిగింది. ధనేశ్వరరావు వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రాధిక దొండపర్తి వద్ద ఓ బ్యూటీపార్లర్‌లో పని చేస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి రాధికను ద్విచక్ర వాహనంపై తీసుకురావడాన్ని గమనించిన ధనేశ్వరరావు వారితో గొడవపడ్డాడు. అయితే ఆమె ఇంటికి వెళ్దాం.. రోడ్డు మీద గొడవ ఎందుకని నచ్చజెప్పడంతో ఇంటికి చేరుకున్నారు. తర్వాత మళ్లీ భార్యతో గొడవ జరిగింది. ఈ క్రమంలో శనివారం ఉదయం తన భార్య నిద్రలేవడం లేదని ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. హుటాహుటిన వచ్చిన వారు రాధికను కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అయితే ఆమె మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించి.. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆమెను ఎవరో గొంతు నలిమి చంపినట్టు వైద్యులు కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు ధనేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. రాధిక తల్లి సింగపల్లి శాంతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు లేక... డోలీ మోత

• బాలింతకు అవస్థలు
• రామన్నపాలెంలో 2కి.మీ డోలిమోతతో తల్లీబిడ్డల తరలింపు



తల్లీబిడ్డలను డోలీ మోత ద్వారా రామన్నపాలెం మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

దేవరాపల్లి : వాలాబు పంచాయతీ శివారు రామన్నపాలెం గ్రామానికి తల్లి బిడ్డను శనివారం డోలీ మోత ద్వారా తరలించారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన గర్భిణి తామర్ల లక్ష్మికి విశాఖ కేజీహెచ్‌లో వారం రోజుల క్రితం వైద్యులు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. ఈ క్రమంలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆమెను తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో శనివారం తీసుకువచ్చి రామన్నపాలేనికి రోడ్డు బాగోలేనందున వాహనం వెళ్లదని వాలాబు మెయిన్‌రోడ్డులో దించేసి వెళ్లిపోయారు. దీంతో సదరు కుటుంబ సభ్యులు తల్లీబిడ్డలను డోలీ కట్టి సుమారు 2 కిలోమీటర్ల మేర మోసుకుంటూ అతికష్టం మీద తీసుకెళ్లారు. ఈ సమయంలో ఆపరేషన్ చేయించుకున్న సదరు బాలింత నరకయాతన అనుభవించింది. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి. దొర బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రామన్నపాలెం, కోడాపల్లికి రోడ్డు సుదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

వేధింపుల అధ్యాపకుడిని తొలగించాలి



విలేకరులతో ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ రమణ

అనకాపల్లి: ఏడాది కాలంగా విద్యార్థినిని వేధిస్తున్న డైట్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ రమణ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినిని వేధింపుల కేసులో రిమాండ్ విధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను కళాశాల యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులే విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేయడం దారుణమన్నారు. మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఇలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటేనే వేధింపులు తగ్గుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అర్జున్, శివాజీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సత్ఫలితాలు



దిబ్బపాలెంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి లచ్చన్న, శాస్త్రవేత్త రామలక్ష్మి

తుమ్మపాల : ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు మంచి ఫలితాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లచ్చన్న, శాస్త్రవేత్త రామలక్ష్మి అన్నారు. మండలంలో దిబ్బపాలెం, సీతానగరం, వెంకుపాలెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం, కెమికల్ ఫార్మింగ్ పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో గ్రామంలో ముందుగా ఎంపిక చేసిన రైతుల పంటల వివరాలను సేకరించారు. గడిచిన రెండు మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం, కెమికల్ వ్యవసాయం చేస్తున్న రైతులను నమూనాగా వారు పండించే పంటల నమూనాలను సేకరించి ఫలితాలు లెక్కకడతామన్నారు. మూడు గ్రామాల్లో మొత్తం 5.25 ఎకరాల్లో లైన్‌సోయింగ్ వేసినట్టు తెలిపారు. విత్తనం వేసిన నాటి నుంచి విత్తనం తీసే వరకు సీఎస్ఎఫ్ పద్ధతులు పాటించి ప్రతి నెలా వివరాలతో పాటు బయోమెట్రిక్ చేస్తున్నామన్నారు. సీసీ ఎక్స్‌పెరిమెంట్ ద్వారా సేకరించిన వివరాలను శాస్త్రవేత్తలకు నివేదిక రూపంలో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు యల్లపు అప్పలనర్సమ్మ, బుద్ద అచ్చియ్యమ్మ, బుద్ద సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ పౌరురాలే గుర్తుకు రాలేదా..

• చాంబర్‌లో ఉన్న తనకు తెలియకుండా హెల్ప్‌డెస్క్ ఎలా ప్రారంభిస్తారు
• కనీస ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం లేదా?
• బీసీ మహిళపై వివక్ష తగదు
• కమిషనర్ ఒంటెద్దు పోకడపై ధ్వజమెత్తిన మేయర్ హరివెంకటకుమారి





హెల్ప్‌డెస్క్ ప్రారంభిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: భారత రాష్ట్రపతి, గవర్నర్, ప్రధాని ఎవరు వచ్చినా.. ప్రథమ పౌరురాలికి ప్రత్యేక ప్రోటోకాల్ ఉంటుందనీ.. అలాంటిది కార్పొరేషన్‌లో కమిషనరే ప్రొటోకాల్‌కు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి ధ్వజమెత్తారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆధునికీకరించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక హెల్ప్ డెస్క్‌ను కమిషనర్ పి.సంపత్‌కుమార్ శనివారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కనీస ప్రొటోకాల్ పాటించకుండా కమిషనర్ వ్యవహరించడంపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యాలయం ఛాంబర్‌లోనే తాను ఉన్నా.. సమాచారం కూడా ఇవ్వకుండా ప్రథమ పౌరురాల్ని, చట్టాన్ని అవమానించి అగౌరవ పరిచారంటూ వ్యాఖ్యానించారు. ప్రొటోకాల్ ప్రకారం తనకు తెలియకుండా హెల్ప్‌డెస్క్‌ని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. బీసీ మహిళ అనే వివక్షతోనే తనపై ఎప్పటికప్పుడు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పాలకమండలి ఉన్నప్పుడు మేయర్‌కు ప్రథమ ప్రాధాన్యమివ్వాలన్న గౌరవం పాటించకుండా ఒంటెద్దు పోకడలతో వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి రోజూ 5 కౌంటర్లలో ఫిర్యాదుల స్వీకరణ

గ్రేటర్ పరిధిలో ప్రజా సమస్యలను ప్రతి రోజూ స్వీకరించేందుకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ప్రధాన కార్యాలయంలో ఆధునికీకరించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏర్పాటు చేసిన 5 కౌంటర్లలో సెలవు రోజులు మినహా ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అర్జీలు నమోదు చేసుకొని జీవీఎంసీ సమావేశ మందిరంలో ఉన్న అధికారులకు వీటిని అందించవచ్చన్నారు. కౌంటర్-1లో సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఇళ్లు, పట్టాల లబ్ధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ ఇబ్బందులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. కౌంటర్-2లో రోడ్లు, కాలువలు, స్ట్రీట్‌లైట్స్, నీటి సరఫరా, పార్కులు, శ్మశాన వాటికలపైన, మూడో నంబర్ కౌంటర్‌లో టౌన్ ప్లానింగ్‌పై ఫిర్యాదులు, కౌంటర్-4లో రెవెన్యూ విభాగానికి సంబంధించి, కౌంటర్-5లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. సమాచారం కోసం టోల్ ఫ్రీ నెం.1800 4250 0009ని కూడా సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీలు వై శ్రీనివాసరావు, రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ఎగ్జామినర్ వాసుదేవరెడ్డి, చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్, డీసీఆర్ శ్రీనివాసరావు, సీఎంహెచ్‌వో డా.నరేష్‌కుమార్, ఉద్యానవన అధికారి దామోదర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన వెంకన్న



కశింకోట : కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో శనివారం స్వామిని వజ్ర కవచంతో పాటు వివిధ రకాల పూల మాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు.

రేపు వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి



నర్సీపట్నం : ఈ నెల 2న దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు మహానేతకు నివాళులర్పించి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు సూచించారు.

నేడు ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

అనకాపల్లి : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచితంగా 3,500 మట్టి గణపతి విగ్రహాలు, వినాయక వ్రతకథ పుస్తకాలు, పసుపు, కుంకుమ, పటిక పంపిణీ చేయనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు, ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రపతి అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాలుగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

కశింకోట : మండలంలోని జి.భీమవరం, కన్నూరుపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సత్యారావు, బి. చిన్నోడు, మండల టీడీపీ అధ్యక్షుడు కాయల మురళీధర్, కన్నూరుపాలెం టీడీపీ నాయకుడు కూండ్రపు అక్కునాయుడు, కూటమి నాయకులు కర్రి సత్యనారాయణ, నిమ్మదల సన్యాసినాయుడు పాల్గొన్నారు. అలాగే మండలంలో 95.56 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 72 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,750	4,750
రెండో రకం	--	--
మూడోరకం	3,000	3,300

అనకాపల్లి సినిమాలు

మారుతీనగర్ సుబ్రమణ్యం : రాజా(మార్నింగ్ షట్షో)
మిస్టర్ బచ్చన్ : రాజా(మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్ : సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు : సత్యనారాయణ స్క్రీన్-2
సింబా : పర్తిసాయి
శ్రీలక్ష్మీనరసింహ(జ్యోతి)జామి : షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
నేను కీర్తన : శ్రీసత్య
డిమోంటి కాలనీ2 : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 264 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 143 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

పైరుకు సిరులు.. సేంద్రియ ఎరువులు

- మండల పరిధిలో 3,500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి
- ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరో 2 వేల ఎకరాల్లో వరి నాట్లు
- రసాయన ఎరువుల కంటే.. సేంద్రియ ఎరువులపైనే రైతుల దృష్టి

అనకాపల్లి : మండలంలో ఈ ఏడాది నేటి వరకూ 3,500 ఎకరాల్లో 70 శాతం నీటితో వరి నాట్లు వేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు 30 శాతం నీటితో మరో 2 వేల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు తోడు ఈ ఏడాది బోర్లు, కాలువల ద్వారా పొలాలకు సాగునీరు అందించారు. ముందుగా నాట్లు వేసిన రైతులు పంట ఏపుగా ఎదగడానికి, మరో పక్క తెగుళ్ల, కలుపు నివారణకు ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు. వరి సాగులో యూరియా, డీఏపీ, పొటాషియం, జింక్ తగిన మోతాదులో వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఎరువుల వాడకం ఇలా...

ఎకరా పొలానికి 5 సెంట్ల విస్తీరంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తర్వాత నాలుగు కేజీల డీపీఏ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాషియం కలిపి నారుమడి ఎదిగేందుకు చర్యలు తీసుకోవాలి. ఎకరా పొలంలో మొదటి దమ్ములో 45 కేజీల యూరియా, ఒక బస్తా డీఏపీ, 40 కేజీల పొటాషియం, 10 కేజీల జింక్ వేసుకోవాలి. పొలాన్ని బాగా దుమ్ము చేసిన తర్వాత వరి నాట్లు వేసుకోవడం వల్ల వరి పంట బాగా పండే అవకాశం ఉంది. జీవన ఎరువులు అయిన అజోష్, పైరిల్లాం, పాస్ఫోబాక్టీరియాలను ఎకరాకు కిలో వంతున 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి పొలంలో జల్లినట్లు అయితే సిఫారసు చేసిన ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చు.

మండల పరిధిలో ప్రస్తుతం వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. పంట సాగులో ఎరువుల పాత్ర కీలకమని చెప్పక తప్పదు. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులు వాడాలని రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల ఆదేశాల మేరకు ఎరువులు వాడటం వల్ల వరి పంట మంచి దిగుబడి వస్తోంది. మోతాదుకి మించి ఎరువులు వాడినట్లు అయితే పంటకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



మార్టూరులో వరి పంటకు ఎరువుల మందు పిచికారీ చేస్తున్న రైతులు

పొటాషియం లోపిస్తే ప్రమాదం..

వరి సాగు చేసే రైతులు యూరియా, డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాషియం వినియోగంపై ఆసక్తి చూపరు. దీంతో పొటాషియం లోపంతో పైరుకు చీడపీడలు సోకి గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. సాగులో పొటాషియం వినియోగంపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సకాలంలో వరి పొలంలో పొటాషియం వాడకపోతే తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది.

సేంద్రియ ఎరువులతో రైతుకు మేలు..

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులతో వరి పంట అధిక దిగుబడి సాధించవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి రావటమే కాకుండా వరి పంటకు గిరాకీ పెరుగుతుంది. రసాయన ఎరువులు ఎక్కువగా వాడితే అనారోగ్యం, దిగుబడి తగ్గడమే కాకుండా నేల సారం తగ్గిపోతుంది.

రసాయన ఎరువులతో తక్కువ దిగుబడి..

రైతులు రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల వరి పంటలో పురుగులు, తెగుళ్ల ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. రైతు పండించే పంటకు తీవ్ర నష్టమే కాకుండా కొన్ని సమయాల్లో పంట దిగుబడి బాగా తగ్గిపోయే అవకాశం ఉంది.

రసాయన ఎరువుల వాడకం ప్రమాదం..



ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు రసాయన ఎరువుల కంటే శాస్త్రవేత్తల సూచనల మేరకు సేంద్రియ ఎరువులపై దృష్టి సారిస్తే వరి పంట దిగుబడితో పాటు, ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది. నేల సారం పెరుగుతుంది. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల ఏడాది పాటు భూమికి శక్తి ఒనగూరుతుంది.

– పి.వి.రంగాచారి, మండల వ్యవసాయశాఖ అధికారి, అనకాపల్లి.

శాస్త్రవేత్తల సూచనలతో వ్యవసాయం చేస్తున్నా..



గత ఏడాది వరకూ రసాయన ఎరువులతో రెండు ఎకరాల వరి పంట పండించేవాడిని. వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు ఈ ఏడాది ఎకరా పొలంలో సేంద్రియ ఎరువుల ద్వారా వరి పంట పండించేందుకు చర్యలు తీసుకున్నాను. ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చినట్లయితే వచ్చే ఏడాది నుంచి రెండు ఎకరాల్లో సేంద్రియ ఎరువు ద్వారా వరి పంట పండిస్తాను.

– పీలా బంగారయ్య, రైతు, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి మండలం.

రిటైర్డ్ ఎంఈవోకు సత్కారం



రిటైర్డ్ ఎంఈవో చిట్టిబాబు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ తదితరులు

కశింకోట : మండల విద్యా శాఖాధికారిగా కె. చిట్టిబాబు ప్రశంసనీయమైన సేవలందించారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. పదవీ విరమణ చేసిన ఎంఈవో చిట్టిబాబుకు శనివారం స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద కల్యాణ మండపంలో మండల ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించి చిట్టిబాబు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు. ఎంఈవో-2 కేఎస్ఎన్ మూర్తి, హెచ్‌ఎంలు ఎంఎస్ స్వర్ణకుమారి, ఆచంట రవి, జేఏసీ ప్రతినిధులు నేమాల రమణ, కె. సూర్యనారాయణ, రమేష్‌రావు, పల్లా బాబ్జీ, డీఎస్ మల్లేశ్వరరావు, శివప్రసాద్, కాయల శ్రీను, పీఎం అప్పారావు, ఎ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరిట మొక్కలు నాటాలి

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ పచ్చదనం మెరుగుపర్చేందుకు మొక్కలు నాటాలని కె.కోటపాడు ఐసీడీఎస్ పీవో మంగతాయారు అన్నారు. కె.కోటపాడు ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి శనివారం మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ తల్లిపేరున ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని, అలాగే మొక్కను సంరక్షించే బాధ్యత చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.కుమారి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం స్ఫూర్తిదాయకం



వీఆర్వో కృష్ణకుమార్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్



మల్లేశ్వరరావును సన్మానించి పుష్పగుచ్ఛం అందిస్తున్న మధుమూర్తి

కె.కోటపాడు: ఉద్యోగ నిర్వహణను అంకిత భావంతో నిర్వహించే ప్రతి ఉద్యోగికి ప్రజలతో పాటు ఉన్నతాధికారుల నుండి తప్పక గుర్తింపు ఉంటుందని పెందుర్తి మండల విద్యాశాఖాధికారి టి.మధుమూర్తి అన్నారు. బి.కింతాడ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన ఈమంది మల్లేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఎ.కోడూరులో ఆయనను శనివారం ఎంఈవో మధుమూర్తి ఘనంగా సన్మానించారు.ఎందరో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులను 38 ఏళ్లుగా అందించిన మల్లేశ్వరరావు పలువురికి ఆదర్శమని మధుమూర్తి అన్నారు. కార్యక్రమంలో కె.కోటపాడు, గోపాలపట్నం పీఆర్‌టియూ అధ్యక్షులు సూర్రెడ్డి శ్రీనివాసరావు, బండారు పేరునాయుడు, ప్రవీణ్, మొహిద్దీన్ పాల్గొన్నారు.

వీఆర్వో కృష్ణకుమార్‌కు సన్మానం

ఆర్.వై.అగ్రహారం వీఆర్వోగా పని చేసిన ఎం.కృష్ణకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలతో అందరి మన్ననలను కృష్ణకుమార్ పొందినట్లు డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ అభినందించారు.కార్యక్రమంలో ఆర్ఐ జానకి, గాయత్రి, కిషోర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పునఃప్రారంభించాలని వినతి



ఎంపీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న మాడుగుల యువకులు

మాడుగుల: పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పునఃప్రారంభించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కార్యాలయానికి పట్టణానికి చెందిన డేరింగ్ బాయ్స్ యువకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఎంపీ సీఎం రమేష్ కార్యాలయంలో లేకపోవడంతో ఆయన తనయుడు రిత్విక్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి ఎంపీ తనయుడు రిత్విక్‌తో పాటు కార్యాలయ సిబ్బంది స్పందించడంతో డేరింగ్ బాయ్స్ యువకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాండవ బ్రిడ్జిపై చిల్లర దుకాణాలు

- రాకపోకలకు వాహన చోదకుల ఇబ్బందులు



తాండవ బ్రిడ్జిపై చేపల అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు



తాండవ బ్రిడ్జిపై దుకాణాలు పెట్టి అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు

పాయకరావుపేట: తుని – పాయకరావుపేట పట్టణాలను అనుసంధానం చేసే తాండవ బ్రిడ్జిపై వ్యాపారాలు సాగించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై వ్యాపారులు అమ్మకాలు చేస్తుండటంతో పాదచారుల రాకపోకలకు వీలులేకుండా పోతోంది. తాండవ బ్రిడ్జిపై పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజలు నిత్యం బ్రిడ్జిపై తుని మార్కెట్‌కు ప్రయాణాలు సాగిస్తుంటారు. అదేవిధంగా తుని ప్రజలు పాయకరావుపేటకు వస్తుంటారు. ఇక్కడ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై ఒక పక్కన చేపలు, ఇతర చిల్లర దుకాణాలు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటి వద్దకు కొనుగోలు చేయడం కోసం ప్రజలు గుంపులుగా ఉండడం వల్ల వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేటలో చేపల మార్కెట్, పండ్ల అమ్మకాలకు అరటికాయల మార్కెట్ స్థలం, బ్రిడ్జి దాటిన వెంటనే తునిలో చేపల మార్కెట్, పండ్ల వ్యాపారాలు ఉన్నప్పటికీ బ్రిడ్జిపైనే వ్యాపారాలు చేస్తూ ఇబ్బందికి గురిచేస్తున్నారు. సంబంధిత అధికార యంత్రాంగం దృష్టి సారించి పట్టణ ప్రజలకు బ్రిడ్జి పైన ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై సీఐ పి.అప్పలరాజును సంప్రదించగా సిబ్బంది కొరత ఉందని, వీలైనంత వరకు ట్రాఫిక్‌పై దృష్టి సారిస్తామన్నారు.

వడ్డాది, కేపీ అగ్రహారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కేపీ అగ్రహారంలో శ్రీకృష్ణుని ఆకారంలో వెలగించిన దీపాలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి, కేపీ అగ్రహారంలో శ్రీకృష్ణుని ఆలయంలో శనివారం శ్రీకృష్ణ నవమి వేడుకల్లో భాగంగా విశేష పూజలు చేశారు. వెయ్యి దీపాలతో శ్రీక్రిష్ణుడి ఆకారంలో దీపాలు వెలిగించి ఆలయాన్ని అలంకరించారు. భక్తి గీతాలు ఆలపించారు. శ్రావణ మాసం ఆఖరి వారం పురస్కరించుకుని వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా పలు గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కేపీ అగ్రహారంలో కొండపాలెం, బయితంపూడి, పైడంపేట తదితర గ్రామాల భక్తులు తరలివచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అనకాపల్లి ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు ప్రేమ్‌దాస్ కోరారు. అమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం గవర్ల అనకాపల్లిలో స్వర్గీయ ఆళ్ల వరలక్ష్మి జ్ఞాపకార్థంగా గొడుగులు, మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరలక్ష్మి జ్ఞాపకార్థంగా నాలుగేళ్ల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆళ్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు దాడి వీరమహాలక్ష్మినాయుడు, బొడ్డేడ చెల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం సీఐ, ఎస్ఐలకు రివార్డు

సబ్బవరం : సబ్బవరం సీఐ పిన్నంటి రమణతో పాటు ఎస్ఐ ధనుంజయ్‌కు అనకాపల్లి ఎస్పీ దీపిక శనివారం రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సబ్బవరం మండలంలో 5 రోజుల కిందట పెద్ద ఎత్తున 912 కిలోల గంజాయి పట్టుకున్న కేసులో రివార్డు, ప్రశంసా పత్రాలను అందించినట్లు సీఐ తెలిపారు. అనకాపల్లిలో శనివానం నిర్వహించిన క్రైం మీటింగ్‌లో ఆమె చేతుల మీదుగా వీటిని అందుకున్నామన్నారు.

తమతోపాటు కానిస్టేబుల్ నాగేంద్ర, డ్రైవర్ నాయుడులకు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు సీఐ చెప్పారు.



ఎస్పీ దీపిక నుంచి రివార్డు, ప్రశంసా పత్రాలను అందుకుంటున్న సీఐ పిన్నంటి రమణ

కేసుల రాజీకి లోక్ అదాలత్ చక్కని వేదిక

నర్సీపట్నం: కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు అవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ నెల 14 న జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రహదారులు ఛిన్నాభిన్నం



- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- వాహన చోదకులు.. పాదచారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

అనకాపల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి పట్టణంలో రహదారులు చిన్నభిన్నంగా మారాయి. ఎక్కడ గొయ్యి, ఎక్కడ కాలువ ఉందో తెలియకపోవడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి నేతలు, ఆర్ అండ్ బీ అధికారులు భారీ గోతులను కనీసం పూడ్చేందుకు చర్యలు తీసుకోకపోవడంతో వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే జాతీయ రహదారి జలగల మధుం రెండు పెట్రోల్ బంకుల వద్ద గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండి భారీ వాహనదారులు, కార్లు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి నాయుళ్లువీధి రైల్వే స్టేషన్ వరకూ వెళ్లే రహదారి భీతిగొల్పుతోంది. దీంతో పాటు వీధులు కూడా గోతులతో దర్శనమిస్తున్నాయి. ఈ గోతుల్లో రాత్రి సయమంలో కొంత మంది వాహన చోదకులు పడి క్షతగాత్రులుగా మారుతున్నా జీవీఎంసీ అధికార యంత్రంగం పట్టించుకునే పాపాన పోలేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది.



విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి నాయుళ్లువీధి మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి (ఇన్‌సెట్) వర్షానికి శిథిలమైన మండలంలోని కొత్తూరు పంచాయతీ దేవీనగర్ రహదారి

ముంచెత్తిన వాన..

కశింకోట : వరుసగా మూడో రోజు శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటలకు 59.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఉదయం 8.30 గంటల వరకు 31.6 మిల్లీమీటర్లు నమోదు కాగా, అప్పటి నుంచి సాయంత్రం 4 గంటల వరకు 27.8 మిల్లీమీటర్లు నమోదు అయింది. గత మూడు రోజుల్లో ఇదే ఎక్కువ వర్షపాతం. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉదయం తెరిపిచ్చిన వర్షం మళ్లీ మధ్యాహ్నం భారీగా కురిసింది. దీంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు నీరు చేరింది. ఆర్టీసీ బస్ స్టేషన్‌ను బురద వీడలేదు. దీంతో కొన్ని బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అలాగే తాళ్లపాలెం కూడలిలోని నర్సీపట్నం వైపు వెళ్లే మార్గంలో నీరు చేరింది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. అలాగే తాళ్లపాలెం సంత వద్ద అసంపూర్తి పోలవరం కాలువలో నీరు చేరింది. అయితే ఈ వర్షాలు ఖరీఫ్ వరి నాట్లకు ఉపకరిస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తాళ్లపాలెం కూడలిలో నిలిచిపోయిన వర్షం నీరు



వరదలా మారిన కశింకోట పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు



స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు నిలిచిపోయిన వర్షపు నీరు

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఈఈకి వినతిపత్రం అందిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

తుమ్మపాల : విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రతతో పాటు ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ నాయకులు శనివారం గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయం ఈఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. సిబ్బందికి మినిట్స్ రూపంలో ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నేటికీ అమలు చేయకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ఈపీఐ, ఈపీఎఫ్, మొబైల్స్ ఇవ్వడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వీ చలపతి, శంకరరావు, పి.వెంకటరమణ, బి.శ్రీను, పి.తులసి తదితరులు పాల్గొన్నారు.